# బర్త్‌డే పార్టీ

ఉష స్కూలు నుంచి వస్తూనే "అమ్మా పిన్ని వచ్చిందా" అంది ఆత్రంగా. ఇంటికి వచ్చావో లేదో అప్పుడే ఆవిడే కావలిసి వచ్చిందా! నీకు మరేంపని లేదేమిటి" కసురుకుంది వసుంధర.

"కాదమ్మా! రేపు నా పుట్టిన రోజుగా! ఇవాళ ప్రొద్దున్నే వచ్చేసి రేపు రాత్రి దాకా మన ఇంట్లోనే ఉంటానంది పిన్ని"

సరేలే పిన్ని రాకపోతే ఇప్పుడేం కొంప మునగలేదు కాని, కాళ్ళు, చేతులు కడుక్కురా! పాలు త్రాగి టిఫిన్ తిందువు గాని"

నాకేం వద్దు పిన్ని వచ్చాకే పాలు తాగుతాను. టిఫిన్ తింటాను." అనేసి పుస్తకాలు అక్కడే పడేసి డ్రెస్సైనా మార్చుకోకుండా వెళ్ళి వీధి గుమ్మంలో నిలబడి పిన్ని కోసం ఎదురు చూస్తోంది ఉష.

ఆ పసిపాపకు పిన్నమ్మతో ఉన్న అనుబంధం అలాంటిది. ఆరు నెలల క్రితం వరకూ ఉష తండ్రి తమ్మునితో కలిసే వుండేవాడు. వసుంధర, వనజ కూడ పొరపొచ్చాలు లేకుండానే కాలం గడిపారు. వాసుకు పెళ్ళై వనజ ఆ ఇంట అడుగుపెట్టిన కొద్ది రోజులకే వసుంధరకు నెలతప్పింది. ఎంతో సంతోషంతో అక్కను ఒక్కపని కూడా చేయనిచ్చేది కాదు. అమిత ప్రేమగా చూసింది.

ఉష పుట్టినప్పటి నుంచి తల్లి కన్నా తనే ఎక్కువ బాధ్యతగా పెంచసాగింది. వసుంధరకు స్నేహితులతో గడపటం, షికార్లు తిరగటం అంటే వున్నంత మక్కువ పాప ఆలనాపాలనా చూడటంలో లేదు. అసలు ఆమె అభిప్రాయం స్త్రీ జీవితం పిల్లల్ని కనటం పెంచడంతోనే గడిచిపోతుందని, సరదాలు కోరికలు తీర్చుకొనే అవకాశం ఉండదని, అందుకే పాప బాధ్యత పూర్తిగా వనజ తీసుకున్నా వసుంధరకు ఏమీ అనిపించలేదు. ఉష వనజ ఒడిలోనే కళ్ళు తెరిచింది. తొలిసారిగా ఆమెను పలకరించి మొలకనవ్వులు ఒలకపోసింది. ఉష మురిపాలతో వనజకు రోజు క్షణంలా గడిచిపోయేది.

పెరుగుతున్న పాపకు గోరుముద్దలు తినిపించటం, తప్పటడుగులు వేస్తూంటే చేయి పట్టుకొని నడిపించటం, చిట్టి చిట్టి మాటలు నేర్పటం అన్ని తనే చేసింది.

అందుకే ఉష ఎప్పుడూ వనజ కొంగుపట్టుకొని తిరిగేది. చూసే వాళ్ళంతా వనజ కూతురే అనుకొనే వాళ్ళు. ఇక ఉష పుట్టిన రోజు వచ్చిందంటే వనజ బోలెడు సందడి చేసేది. తలంటి, తనే స్వయంగా కుట్టిన కొత్త గౌను వేసేది. స్నేహితురాళ్ళంతా "ఏమే వసూ మీ అమ్మాయి అసలు మీ దగ్గరకు రాదేం! చూస్తూంటే నీతోటి కోడలే దానికి అమ్మ అయినట్టుంది! ఎప్పుడూ ఆవిడ చూట్టూ తిరుగుతుంది." అనే వారు "ఆ పోనివ్వండి! రోజంతా దాని ముచ్చట్లన్నీ తీరుస్తూ గడిపే ఓపిక నాకు లేదు. అనేసేది తేలికగా.

ఉష పెరుగుతున్న కొద్దీ వనజ ఉషల మధ్య అనుబంధం మరింత గాఢంగా అల్లుకుపోసాగింది. ఉషకు నాలుగేళ్ళు నిండగానే తనే ఉషను స్కూలులో వేసింది. రోజూ స్కూలులో దిగబెట్టడం, ఇంటికి తీసుకురావడం చేసేది. ఉష స్కూలులో ఏం నేర్చుకొన్నదీ, తెలుసుకొన్న కొత్త విషయాలు అన్నీ పిన్నికి చెప్పేది. ఇంతగా వనజతో అలవాటైపోయినా, ఉషను సాకటం వనజ వెళ్ళిపోయి ఆరునెలలైనా కష్టంగా వుంది. వసుంధర ఎప్పుడూ ఉష పిన్నినే తలుస్తుంది. నిద్రలో కూడ తననే కలవరిస్తుంది. ప్రతిదానికీ దూరం చేయటమే. ఎలా పాపకు చేరువు అవ్వాలో ఆరునెలలైనా అంతుపట్టుటలేదు వసుంధరకు. వనజా తను కలిసి వున్నప్పుడు పాప అసలు ఏ విషయానికి పేచి పెట్టేదీ కాదు. ఇప్పుడు అన్నింటికి దానితో గోడవే.

వసుంధర విసుగ్గా బయటకి వచ్చింది "లోపలికి రా ఉషా! పాలైనా తాగకపోతే ఆకలేస్తుంది." "మరి పిన్ని లేదుగా!" "అబ్బబ్బ ఎప్పుడూ నీకు పిన్ని గొడవే విసిగించకుండ చెప్పిన మాట విను" బలవంతాన ఉషను ఎత్తుకొని లోపలికి నడిచింది. ఉష పాలగ్లాసు చేతుల్లో వుంచుకొని ఏడవటం మొదలు పెట్టింది.

వసుంధర సముదాయించే ప్రయత్నం చేస్తుంది. ఉష వనజ కోసం అంతగా అలమటించి పోతుంటే వనజ మనస్సులో ఆ చిన్నారే మెదులుతుంది.

ఆ పసిదాని కోసం ఆమె మనస్సు ఎంతో ఆరాటపడుతోంది. కాని ఆ యింటికి తనకూమధ్య ఎప్పుడో దూరాలు పెరిగిపోయాయి.

వసుంధరకు తనంటే ఇది వరకటి అపేక్ష లేదు. పైగా చులకన భావం ఏర్పడి పోయింది. అందుకే తనకు కలిసివుండటం కన్నా వేరుపడటం మంచిదనిపించింది. కానీ ఉషను వదిలి వుండలేక తను ముందుగా తొందరపడలేదు.

ఓ రోజు వసుంధర అంది. "చూడు వనజా నువ్వు ఏమీ అనుకోకుకానీ మీరు వేరే వుంటే మంచిది" వనజకు ఏమి అనాలో తోచలేదు. అదేమిటక్కా అలా అంటున్నావు ఇప్పుడు నేను ఏమి చేశానని. ఈ ఆరేళ్ళుగా మనం కలిసే ఉంటున్నాముగా. "అందుకే నేను చెబుతున్నాను ఇప్పుడు మనమేమీ పోట్లాడుకోలేదు. నువ్వు చదువుకున్న దానివి. అయినా నీకు నాగరిక సమాజంలో నలుగురితో కలిసిమెలసి మసులుకోవటం చేతకాదు. అందుకే ఇక మనం విడిగా వుండటం మంచిది.

మరేం మాట్లాడకుండా వనజ తన గదిలోకి వెళ్ళిపోయింది ఆమె మనస్సులో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. ఎంతగా మారిపోయింది వసుంధర. యిదే కాబోలు నడమంత్రపు సిరి ప్రభావం అంటే ఆరు నెలల క్రితం వరకు అన్నదమ్ములిద్దరికీ ఒకే మోస్తరు ఉద్యోగాలు కావటంతో, ఇద్దరి సంపాదనా సమానం కావటంతో ఒడిదొడుకులు లేకుండా కలసి గడిపారు. తన భర్తకు వేరే కంపెనీలో మేనేజరుగా పెద్ద ఉద్యోగం దొరకటంతో వసుంధరకు హోదా పెరిగి పోయింది. అప్పటినుంచే తనంటే తేలిక భావం. ఏదో వాళ్ళు సంపాదిస్తున్నది నేను తినేస్తూన్ననని తను అనుభవిస్తూన్న సుఖమయ జీవితంలో పాలు పంచేసుకొంటున్నట్లు ఆమె భావాలు చూపించేది. ప్రతి చిన్న విషయానికి పోట్లాడాలని చూసేది. తను ఇవేమీ భర్తకి చెప్పేది కాదు. చెబితే తడు తనను వేరే తీసుకువెళ్ళిపోతాడు. తన ఉష దూరమయిపోతుంది. అందుకే సాధ్యమైనంత వరకు కలిసే వుండాలని ప్రయత్నించింది. కానీ చివరకు వసుంధరే తేల్చి చెప్పేసింది. తమతో కలిసివుండొద్దని. ఇంక తను చెయ్యగలిగింది ఏమి లేదు. వేరు పడక తప్పదు.

అసలే పౌరుషం గల వాసు. వదిన అభిప్రాయం తెలిసేక నాలుగురోజులకన్నా ఆ యింట వుండలేదు. వేరే యిల్లు చూసుకొని వనజను తీసుకువెళ్ళిపోయాడు.

వనజకు దిగులుగా వుండేది. నిర్లిప్తంగా వుంటున్న భార్యతో ఏమిటి వనజా అలా వుంటున్నావు! అంతా ఉషకోసం బెంగ అనేవాడు. అవునండి. నాలుగేళ్ళు పెంచి దాన్ని వదలి వచ్చేశాను. ఉష నా ప్రాణం. నేను ఏం చేస్తున్నా నా కళ్ళలో అదే కదలాడుతుంది. పిన్నీ పిన్నీ అంటూ నా వెంటే తిరుగుతున్నట్లుంది. నువ్వు బాధ పడతావనే నేను యిన్నాళ్ళు వూరుకున్నాను. కాని అన్నయ్య కూడా తనకంటే నేను తక్కువని, మనతో కలిసివుంటే తన హోదాకు తక్కువనే అభిప్రాయపడేవాడు.

తన కొత్త కొత్త స్నేహితులు, పెద్ద హోదాలో వున్నవాళ్ళు, బాగా ధనవంతుల యింటికి వచ్చినపుడు మన ఉనికి అస్సలు గిట్టేది గాదు. వాళ్ళ భావం తెలిసి కూడా అక్కడ ఎన్నాళ్ళు వుండగలం చెప్పు !

నిజమేనండీ కానీ ఆ పసిదాన్ని మరచిపోలేకపోతున్నాను. అంది నిట్టూరుస్తూ. "బాధపడకు మనమే అప్పుడప్పుడు వెళ్ళి పాపను చూసొద్దాం అన్నాడు వాసు. తరచూ వాళ్ళిద్దరు వెళ్ళేవారు. వనజ అయితే ఉషను వదిలి ఉండలేక భర్తకు తెలియకుండా కూడా యించుమించు నాలుగు రోజులుకొసారి వెళ్ళి వచ్చేది. రాను రాను ఆ ఇంటి వాతావరణంలో మార్పు రాసాగింది. తరచూ విందులు ఏర్పాటు చేసుకొనేవారు. అవి కూడా వనజ వాళ్ళు అక్కడ ఉన్నప్పటిలా సామాన్యంగా కాదు, అతి ఆడంబరంగా డ్రింక్ పార్టీలు. అలాంటి దృశ్యాలు చూసినప్పుడు వనజకు కళ్ళు తిరిగేవి. ఇందుకే నన్నమాట తనతో కలిసి వుండాటానికి వాళ్ళు ఇష్టపడలేదు. అనుకుంది. సుదర్శనం తాగుడికి బాగా అలవాటు పడ్డాడు. ఈ విషయం వాసూ వనజలకు చాలా బాధగా అనిపించింది. వుండబట్టలేక ఓసారి వసుంధరతో అంది. అక్కా! బావగారు రాను రాను తాగుడికి బానిస అయిపోతున్నారు. ఇప్పటికైనా జాగ్రత్త పడకపోతే ఎమౌంతుందో ఉహించావా! ఉష కోసమైనా బావగారికి ఈ అలవాటు తప్పించు అని అంది. వసుంధర మండిపడింది. "తోటికోడలవని

చేరనిస్తే మాకే నీతులు చెబుతున్నావా! మా సుఖసంతోషాలు చూడలేక కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నావు. ఆనందంగా బ్రతకటం చేతకానివాళ్ళు చెప్పేనీతులు ఇలానే వుంటాయి.'' అంది. వసుందర మూర్ఖత్వానికి వనజకు అసహ్యం కలిగింది. అప్పటి నుంచి ఆ యింటికి వెళ్ళటం తగ్గించేసింది. ఎప్పుడైనా వెళ్ళినా, కాసేపు ఉషతో గడిపివచ్చేసేది. ఈ రోజు వెళ్ళాలి. రేపు తన ప్రాణానికి ప్రాణమైన ఉష పుట్టిన రోజు. ఎప్పుడూ ఎంతగానో ఎదురు చూసే తీయని రోజు, అన్నీ మరచిపోయి వసుంధరను ఒప్పించి ప్రతి ఏడాదిలా రేపు సాయంత్రం పేరంటం చెయ్యాలి. ఓ రెండు పట్టు చీరలు హ్యాండు బ్యాగులో పెట్టుకొని శ్రీవారితో చెప్పి బయలుదేరింది. పిన్నిని చూస్తూనే ఒక్క అంగలో దగ్గరకు వెళ్ళి చూట్టేసింది ఉష.

ఉషను ఎత్తుకొని ముద్దుల వర్షం కురిపించింది.

పిన్నీ... రేపు.... రేపు.... మా బంగారుతల్లి ఉష పుట్టిన రోజు. ఉష కిలకిలా నవ్వేసింది. అరే నువ్వువచ్చి ఎంతసేపైంది! మామూలుగానే పలుకరించింది వసుంధర.

ఇపుడే వచ్చాను. రేపు దీని పుట్టినరోజుగా! పేరంటం చేసి హారతిద్దాం. ఉష పుట్టిన రోజని నాకూ గుర్తుంది. కానీ ఆ పేరంటం గొడవ అంటే విసుగు పోనిద్దూ!

మీ బావగారు ఈ సారి దీని బర్త్‌డే పార్టీ ఘనంగా చేద్దామంటున్నారు. వచ్చే వాళ్ళంతా పెద్ద వాళ్ళు . మనం హారతిచ్చి అక్షింతలు వెయ్యమంటే నవ్వరూ! వసుంధర చెప్పుకు పోతుంది.

వనజకు అంతా అర్ధమయిపోయింది. అయితే పాపాయికి ఈ పుట్టిన రోజు కూడా వీళ్ళకు ఇలాంటి డ్రింకు పార్టియే అన్నమాట.

తనకు ఇక పేరంటం చేసి ముచ్చట తీర్చుకొనే అదృష్టం లేదు అనుకొంది. మరునాడే తలంటు పోసి తను తెచ్చిన క్రొత్త గౌను పాపాయికి తొడిగి, ముస్తాబు చేసి, కాసేపు ముద్దాడి వెళ్ళిపోయింది. వనజ వెళ్ళిపోతుంటే వసుంధర అభ్యంతరం చెప్పలేదు. సుదర్శనమైనా వాసూ రాలేదేమని అడుగలేదు. ఉష మాత్రం పిన్ని వెళ్ళిపోతున్నందుకు అలిగింది. ఆ సాయంత్రం ఉష బర్త్‌డేపార్టీకి సుదర్శనం వసుంధరల మిత్రబృందం చాలా మంది వచ్చారు. వసుంధర ఉషకు వనజ వేసిన గౌను తీసేసి తను కొన్న ఖరీదైన డ్రెస్సు వేసింది. ఉష తన ప్రతి పుట్టిన రోజున ఎలా కిలకిల నవ్వేదో, ఆ చిన్నారి మనస్సు ఎంత సంబరంతో అంబరమంటేదో, ఈ ఏడు అంతగా చిన్నబోయింది.

"అమ్మా నాకు హారతివ్వవా? అందరికీ పంచడానికి శనగలు లడ్డూలు ఏవీ" అంది. "అలా పిచ్చి పిచ్చి మాటాలాడకు! అంతా నవ్వుతారు. బుద్ధిగా మా అందరి మధ్య కూర్చో" అంటూ పాపాయి చేయి పట్టుకొని హాలులోకి నడిచింది. ఉషను కుర్చీలో కూర్చోపెట్టింది. న్యూమోడల్‌లో ఉష బర్త్‌డే జరుగుతోంది. కొవ్వొత్తులు ఆర్పటం, ఉష చేత కేకు కట్ చెయించటం జరిగింది. కాసేపటికి అంతా డ్రింకు పార్టీలో లీనమయిపోయారు. పెద్ద పెట్టున ఏవేవో మాట్లాడుకుంటూ నవ్వుకుంటూ ఆనందంలో మునిగి తేలుతున్నారు. ఉషను పట్టించుకునేవాళ్ళే లేరు. ఆ చిన్నారి మనస్సంతా వెలితిగా వుంది. పిన్ని చేసే పేరంటంలా ఈ పార్టీ లేదు అనుకొంది. అసలు వాళ్ళంతా తన పుట్టిన రోజుకు వచ్చారా! కాదు వాళ్ళంతా త్రాగేస్తూ తింటూ వేరే కబుర్లు

చెప్పేసుకొంటున్నారు. తన పుట్టిన రోజున వచ్చిన పిన్ని కూడా ఎందుకో వెళ్ళిపోయింది. తను యిక్కడి కన్నా పిన్ని దగ్గరే వుంటే బాగుండును అనుకుంది.

మెల్లగా తల్లి దగ్గరకు వెళ్ళింది. నన్ను ఎంచక్కా అందరూ ఒళ్ళో కూర్చో పెట్టుకొని ముద్దాడరేం? పిన్ని పేరంటం చేసినప్పుడు వచ్చిన వాళ్ళంతా అలా ముద్దాడేవారు. ఆ పసిదాని మనసులో అణిగివున్న కోరిక తీర్చుకోవాలని తల్లితో అంది. "అబ్బబ్బ అల్లరి చెయ్యకు చూడూ నువ్వు అలా పవిట పట్టుకొని లాగుతుంటే వాళ్ళంతా ఎలా చూస్తున్నారో" ఉషని విదిలించుకుంది. ఉష ఏడుపు ముఖం పెట్టింది. పోనీ నీ ఒళ్ళో నైనా కూర్చుంటా" చీర నలిగిపోతుంది. ఏమిటి నీ పెంకితనం. ఎవరి కంట పడకుండా ఉషని గిల్లింది. వెళ్ళి తన కుర్చీలో కూర్చుంది. ఆ అమాయకపు చిన్నారి. ఆ చిన్నారి మనసులో ఓ ఊహ మెరిసింది. తనే పిన్ని దగ్గరకు వెళ్ళి పోతే? ఇక్కడ తనకేమో బాగోలేదు. అమ్మ కూడా కోప్పడుతుంది గిల్లుతోంది. పిన్ని అయితే ఎంచక్కా తినిపించి జోకొడుతూ నిద్ర పుచ్చుతుంది. అప్పుడు ఎంత బాగుంటుంది. ఉష మళ్ళీ వసుంధర దగ్గరకు వెళ్ళింది. అమ్మా నే పిన్ని దగ్గరకు వెళ్ళి పోతాను అంది. స్నేహితురాళ్ళతో కబుర్లు చెప్పటంలో లీనమయిన వసుంధరకు కూడ కూతురు ఏమన్నదీ అర్థం కాలేదు. కానీ అది తన దగ్గరకు వచ్చి ఏదో అడుగుతున్నందుకు మాత్రం చిరాకు కలిగింది. ఆ పసి దాని వైపు ఉరిమిచూసింది. ఉష మాత్రం భయపడలేదు. మళ్ళీ మళ్ళీ, అమ్మా! వెళతాను అంటోంది. అబ్బ అబ్బ సరే నీ యిష్టం అనేసింది. ఉష బయటకు వచ్చేసింది. మగ వాళ్ళంతా అప్పటికే మత్తులో మునిగి తేలుతున్నారు. అందుకే సుదర్శనం ఉషను గమనించలేదు. ఇల్లు దాటి ఎటో నడుస్తోంది. ఎన్నో విద్యుత్ దీపాలతో అలంకరించబడి మిరుమిట్లు గొలిపే తన బర్త్‌డే పార్టీ జరుపుతున్న ఆ భవనాన్ని దాటి ,సామాన్యమైన వీధి దీపాల వెలుగులో పయనిస్తుంది. సందె వేళ దాటి రాత్రి సమీపిస్తుంది. పిన్ని ఎక్కడవుంటుంది తను ఎలా వెళ్ళాలి ఆలోచిస్తూ అడుగులు వేస్తోంది.

వచ్చే పోయే బస్సులతో, లారీలతో, ఇతర వాహనాలతో రోడ్డంతా రద్దీగా వుంది. వేగంగా వస్తున్న బస్సు చక్రాల క్రింద నలిగిన ఆ పసికూన ప్రాణం పంచభూతాలతో లీనమయిపోయింది. విషయం తెలిసే సరికి వసుంధర సుదర్శనాలకు మైకం వదలిపోయింది. చేతులారా తన బిడ్డను తానే చంపుకున్నామని కంటికి కడివిడుగా ఏడ్చింది. వసుంధర ప్రాణప్రదంగా పెంచిన వనజ సోకమూర్తిలా అయిపోయింది. వెక్కి వెక్కి ఏడుస్తూ వచ్చి అక్కా నీ నాగరికతా వ్యామోహం వల్లే మన బంగారుతల్లి బలి అయిపోయింది అంది. అవును చెల్లీ నేనూ ఎంతగానో కుమిలి పోతున్నాను. నా ఆడంబరాల వ్యామోహం వల్లే నా చిట్టి తల్లికి అప్పుడే నూరేళ్ళు నిండి పోయాయి. దాని పుట్టిన రోజే గిట్టిన రోజుగా మార్చేశాను. యిపుడు మా కళ్ళకు కట్టిన పొరలు కరిగిపోయాయి. కానీ ఏం ప్రయోజనం గుండెలు పగిలేలా ఏడుస్తోంది వసుంధర. హోదా పెరిగేటప్పటికి డబ్బు కళ్ళపడేసరికి లేని పోని గొప్పలకు పోయి కన్న బిడ్డలనే బలి చేసుకొన్న వసుంధర లాంటి వాళ్ళు, జీవితాంతం కడుపు కోత అనుభవించక తప్పదు మరి అనుకొన్నది వనజ.

*జులై, 1999. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి ప్రసారం* ❑